క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



కల్వకుర్తి: పట్టణంలోని పలు వార్డులలో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ సత్యం కౌన్సిలర్లతో కలిసి శుక్రవారం పరిశీలించారు. మున్సిపాలిటీలో టీయూఎఫ్ఐడీసీ కింద చేపడుతున్న పనుల పురోగతిని తెలుసుకొని, పనులను పూర్తి నాణ్యతతో త్వరితగతిన చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట వైస్ చైర్మన్ షాహెద్, మున్సిపల్ ఏఈ షబ్బీర్, ఆయా కాలనీవాసులు ఉన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా మాధవులు

తిమ్మాజిపేట: మండల కేంద్రం తిమ్మాజిపేటకు చెందిన చెవ్వ మాధవులు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైనట్లు పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మార్కెట్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డికి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి, మండల పార్టీ నాయకులకు మాధవులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ



అమ్రాబాద్: పదర తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆర్డీఓ మాధవి ఆకస్మికంగా సందర్శించారు. అధికారులు, సిబ్బంది హాజరు వివరాలు పరిశీలించారు. పదరతో పాటు అన్ని గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి సర్వే నంబర్లను నమోదు చేసి నివేదిక ఇవ్వాలని సూచించారు. తహసీల్దార్ సురేషబాబు, ఎమ్మార్ఐ శేఖర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



తిమ్మాజిపేట: మండలంలోని గొరిట గ్రామానికి చెందిన రజక సంఘం నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. గ్రామానికి చెందిన రజక సంఘం నాయకులు సత్యనారాయణతో పాటు పలువురు కార్యకర్తలు బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పార్టీ కండువాలు ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. సీనియర్ నాయకులు దామోదర్‌రెడ్డి, ఆంజనేయులు, రాంచంద్రయ్య, మండల నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

తర్నికల్‌లో వైద్య శిబిరం

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్‌లో యన్నం ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 200 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. డాక్టర్ హరికాంత్‌రెడ్డి, డాక్టర్ మనోహర్‌రెడ్డిలు వైద్య పరీక్షలు చేశారు.

అంబులెన్స్‌లో ప్రసవం

వెల్దండ: మండలంలోని చెర్కూర్ గేట్ వద్ద ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన గర్భిణి సంతోషికి పురిటినొప్పులు అధికం కావడంతో శుక్రవారం 108కు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు వైద్య సిబ్బంది సకాలంలో చేరుకొని గర్భిణి సంతోషిని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా పురిటినొప్పులు అధికం కావడంతో మార్గమధ్యలోనే మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం కల్వకుర్తి ఆస్పత్రిలో చేర్పించినట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

విజ్ఞాన ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ

కల్వకుర్తిరూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో మండలంలోని పంజుగుల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారు. డీఈఓ రవి కుమార్ బహుమతి అందజేశారు.

28 నుంచి ఏపీజీవీబీ సేవలు బంద్

తాడూరు: ఏపీజీవీబీ 2025 జనవరి నుంచి తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకుగా పేరు మారుతుందని బ్యాంకు మెనేజర్ గున్మయి అన్నారు. మండలంలోని మేడిపూరులో శుక్రవారం బ్యాంకు ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు బ్యాంకు సేవలను వినియోగించుకోవాలన్నారు. డిసెంబరు 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు బ్యాంకు సేవలు నిలిచిపోతాయన్నారు. ఖాతాదారులు సహకరించాలని కోరారు. అజిత్ నాయక్, సంతోష్, ఆర్‌బిఐ కౌన్సిలర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



ఉప్పునుంతల మండలం వెల్టూర్‌లో..



కల్వకుర్తి మండలం ఎల్లికట్టలో ఇంటింటి సర్వే చేస్తున్న బృందం

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. లబ్ధిదారుల ఎంపిక కోసం ఇంటింటికి వెళ్లి అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. అర్హుల ఎంపిక కోసం గ్రామస్తులతో చర్చించి నమోదు చేసుకుంటున్నారు.

■ కల్వకుర్తి మండలంలోని ఎల్లికట్టలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారి వద్దకు వెళ్లి సర్వే నిర్వహించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాకేష్‌శర్మ, భూపాల్‌రెడ్డి, నంద్యానాయక్, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

■ పెద్దకొత్తపల్లిలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు సర్వే నిర్వహించారు. గ్రామంలో ఇళ్లు లేని వారిని గుర్తించి కమిటీ సభ్యులు పేర్లను నమోదు చేస్తున్నారు. కార్యదర్శి నాగశేషి, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు లక్ష్మయ్య, రాముడు, శ్రీనివాస్‌రెడ్డి, అలివేల, పర్వీనబేగం, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దండు నర్సింహ, శశికళ, శివశంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

■ చారకొండ మండలంలోని మర్రిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల అర్హుల కోసం కార్యదర్శి రవిశంకర్ సర్వే చేపట్టారు. మర్రిపల్లి, సిర్సనగండ్ల, శాంతిగూడెం గ్రామాల్లో ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ సర్వేను పరిశీలించారు. సురేందర్ రెడ్డి, అల్తాఫ్, నాయకులు మాజీ సర్పంచ్ నరేష్ నాయక్, నాయకులు తదితరులు ఉన్నారు.

■ తాడూరుతో పాటు, పాపగల్‌లో సర్వే నిర్వహించారు. కార్యదర్శి చినబీరయ్య ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు రమేష్, లింగం, కృష్ణారెడ్డిలు ఇంటింటికి తిరిగి వివరాలు తెలుసుకున్నారు.

■ ఉప్పునుంతల మండలంలోని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయడానికి పంచాయతీ కార్యదర్శులు సర్వే చేస్తున్నారు. మొబైల్ యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ఆధార్ కార్డు, రేషన్‌కార్డు వివరాలను యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఎంపీడీఓ మోహన్‌లాల్ పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.



పెద్దకొత్తపల్లిలో..



చారకొండ మర్రిపల్లిలో..



తాడూరు మండలం పాపగల్‌లో..

భక్తిశ్రద్ధలతో ఇరుముడి



హనుమాన్ మాలధారులతో హిందూ, ముస్లిం నాయకులు

చారకొండ: మండల కేంద్రంలో ఆంజనేయస్వామి మాలధారుల ఇరుముడి మహోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి పిల్లి మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో తొమ్మిది మంది స్వాములు ఇరుముడి కట్టుకొని మద్దిమడుగుకు బయలుదేరి వెళ్లారు. మండల కేంద్రానికి చెందిన గుండె పార్వతమ్మ వెంకటయ్య గౌడ్ అన్నదానం నిర్వహించారు. గురుస్వాములు రవి, నాగేష్ గౌడ్, కొండల్, జీవన్, రమేష్ గౌడ్, తదితరులు ఉన్నారు.

స్వాములకు అన్నదానం

మన్ననూర్: ఉమామహేశ్వర కాలనీలోని స్వాముల ఆశ్రమం వద్ద ఆంజనేయస్వామి మాలలు ధరించిన స్వాములకు హిందూ, ముస్లింలు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా వేణుగోపాలస్వామి ఆలయం ముందున్న ఆంజనేయ స్వామి గుడి అభివృద్ధి కోసం పార్టీ నాయకులు సైదులు, వెంకటరమణ, సత్యనారాయణ, కుమారస్వామి ఒక్కొక్కరు రూ: 10 వేల చొప్పున చందాలు చెల్లించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రహీం, ఉమామహేశ్వర ఆలయం పాలక మండలి సభ్యురాలు సంబు శోభ పంబలి బుచ్చయ్య, వెంకటరమణ, హన్మంత్‌రెడ్డి, ఇస్మాయిల్, రెహమాన్, షకీల్, రవూఫ్, కుమారస్వామి ఉన్నారు.

అంజన్న మాల విరమణ ఉత్సవాలు

అమ్రాబాద్: హనుమాన్ మాలవిరమణ ఉత్సవాల సందర్భంగా నల్లమల లోతట్టు ప్రాంతమైన పదర మండలంలోని మద్దిమడుగు క్షేత్రంలో వెలిసిన పబ్బతి ఆంజనేయస్వామి సన్నిధికి భక్తులు చేరుకుంటున్నారు. ఆంజనేయ దీక్ష మాలధారులు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు. ఈ సందర్భంగా హనుమాన్ నమాస్మరణ మార్మోగింది. స్వామి సన్నిధిలో దీక్షమాల విరమణ పొందుతున్నారు. ఉత్సవాలలో భాగంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు రాములు ముఖ్యకార్యనిర్వాహణ అధికారి రంగాచారి, అర్చకులు వీరయ్యశాస్త్రి బృందం ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ, పంచగవ్యం, వాస్తుపూజ, హోమం, రుద్రహోమం, స్వామివారికి సహస్రనామార్చన, మన్యు సూక్తహోమం, బలిహరణ, నీరాజన మంత్రపుష్పములు, తీర్థప్రసాద వితరణలు నిర్వహించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కోనేరు సంస్థ నిర్వాహకులు

తెలకపల్లి: మండలంలోని పెద్దూరులో కైలాస సత్యర్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ సౌజన్యంతో కోనేరు సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామ చైల్డ్ మ్యారేజ్ ప్రొఫెషనల్ అధికారి శివ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. ఎవరైన బాల్య వివాహాలు చేస్తే రూ. 20 వేల జరిమానాతో పాటు రెండు సంవత్సరాల జైలు శిక్ష ఉంటుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కోనేరు సంస్థ మొబలైజర్ రజిత, అంగన్‌వాడీ కార్యకర్త విజయమ్మ, ఆశకార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం




తాడూరులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తహసీల్దార్, ఎంపీడీఓ

తిమ్మాజిపేట: క్రీడలతో మానసికోల్లాసం కల్గిస్తాయని ఎంపీడీఓ లక్ష్మీదేవి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సీఎం కప్ క్రీడలను తహసీల్దార్ రామకృష్ణయ్యతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోటు క్రీడల్లో రాణించాలన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. వాలీబాల్ పోటీలో తిమ్మాజిపేట జట్టు ప్రథమస్థానంలో, కోడుపర్తి ద్వితీయ స్థానంలో, కబడ్డీలో గొరిట ప్రథమ, చేగుంట ద్వితీయ స్థానాలలో నిలిచాయి. అదేవిధంగా ఖోఖోలో తిమ్మాజిపేట ప్రథమ, పోతిరెడ్డిపల్లి ద్వితీయ స్థానంలో నిలిచాయి. క్రీడల నిర్వహణకు చిలుక సురేందర్ రెడ్డి సోదరులు రూ. 40 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఈ సత్యనారాయణ శెట్టి, నాయకులు వెంకట్రామ్‌రెడ్డి, మల్లయ్యగౌడ్, సురేందర్‌రెడ్డి, మాధవులు, వివేక్‌రెడ్డి, రవూఫ్, లక్ష్మీనారాయణ, నాగసాయిలు, భాస్కర్‌గౌడ్, అశోక్ రెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేత

సీఎం కప్ క్రీడల్లో భాగంగా నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో గెలుపొందిన విజేతలకు శుక్రవారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంపీడీఓ లక్ష్మీదేవి, భాస్కర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వివేక్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ముబారక్, అశోక్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలోని క్రీడామైదానంలో సీఎం కప్ క్రీడలకు హాజరైన క్రీడాకారులను తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీఓ బ్రహ్మచారీలు పరిచయం చేసుకొని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పీఈటీలు శేఖర్, శ్రీకాంత్, అనిత, నిర్మల, కార్యదర్శి పవన్ కుమార్, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాజిపేటలో..



ప్రశాంసా పత్రం అందజేస్తున్న నాయకులు

భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రతం

కందనూలు: జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రం పక్కన ఉన్న పురాతనమైన శివాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా శుక్రవారం నాగర్‌కర్నూల్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సామూహిక హనుమద్ వ్రతం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో హకీం, సుదర్శన్, పాండురంగయ్య, గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు ఎలిమె ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

కందనూలు: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కళాశాల ప్రిన్సిపాల్ జి.మాధవి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. 90 రోజుల్లో ప్రతి సబ్జెక్టులో ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు నేర్చుకొని 2025 వార్షిక పరీక్షలో ఉత్తమ ఫలి తాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

వసతి గృహాన్ని సందర్శించిన ఎంపీడీఓ

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని ఎంపీడీఓ లక్ష్మీదేవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహంలో వంట గదులను, స్టోర్ రూం, స్నానపు గదులను పరిశీలించారు. వంట గదిలో వండిన వంటలను ఆమె పరిశీలించారు. కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేశారు. బాలికలకు నాణ్యమైన ఆహారం అందించాలని ఎంపీడీఓ హాస్టల్ వార్డెన్‌కు సూచించారు.

సబ్‌స్టేషన్ నిర్మాణ స్థలసేకరణ పరిశీలన



అచ్చంపేట రూరల్: మండలంలోని సింగారంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం స్థలాన్ని శుక్రవారం తహసీల్దార్ చంద్రశేఖర్ పరిశీలించారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి అనుకూలంగా రైతు బొడ్డుపల్లి బాల్‌నారాయణ 0–18 గుంటల భూమిని వితరణ ఇచ్చారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుతో సింగారం, ఎద్దు మిట్టతండా, పెద్ద తండా, అంకిరోనిపల్లి, వంకమూతితండాతో పలు గ్రామాలకు విద్యుత్ సమస్య తొలగనుందని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ బాల్‌రాం, గ్రామస్తులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

15న ఎదిరేపల్లి మశమ్మ స్మారక పురస్కారం

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని సింగిల్ విండో సమావేశం మందిరంలో ఈ నెల 15న ఎదిరేపల్లి మశమ్మ స్మారక పురస్కార కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎదిరేపల్లి కాశన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కవి, విమర్శకులు గుంటూరు నర్సయ్య అందజేస్తారని పేర్కొన్నారు. బహుజనులను, దళితులను ఒక తాటిపై నడుపుతూ విశేష కృషి చేస్తున్న లక్ష్మీనర్సయ్య ఈ పురస్కారానికి ఎంపికైనట్లు వివరించారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్ బుక్ ఫేర్ అధ్యక్షుడు డా. యాకూబ్, నెలపొడుపు అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య, గౌరవ అధ్యక్షుడు కందికొండ మోహన్, వహీద్‌ఖాన్, ఆర్ సత్యం, ముచ్చర్ల దినాకర్ హాజరవుతారని వెల్లడించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన నెంట బాలయ్యకు, హిమబిందులకు సీఎంఆర్ఎఫ్ నుంచి ఒక్కొక్కరికి రూ.60 వేలు మంజూరయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బాధిత కుటుంబాలకు అందజేశారు. ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ, నాయకులు ఆంజనేయులు, అనిల్‌కుమార్, శ్రీను, దశరథం, మల్లయ్య, మదవులు తదితరులు ఉన్నారు.

జర్నలిస్ట్ కుటుంబానికి పరామర్శ

మండలంలోని రాచూర్ గ్రామానికి చెందిన జర్నలిస్ట్ అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. ఆయన వెంట పొల్యూష్యన్ కంట్రోల్ బోర్డు బాలాజీసింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితి విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు ఆనంద్‌కుమార్, సంజీవ్‌కుమార్, గున్నేల శ్రీనివాస్, నారాయణ, సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు..

చారకొండ: మండలంలోని కల్వకుర్తి నియోజకవర్గ గ్రామాలు జూపల్లి, జేపల్లి, గోకారం, చంద్రాయన్‌పల్లి, ఎర్రవల్లి, శేరిఅప్పారెడ్డిపల్లి గ్రామాల సంబంధిత 25 మంది లబ్ధిదారులకు, కల్యాణలక్ష్మి చెక్కులను శుక్రవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఆయా గ్రామాల నాయకులు, లబ్ధిదారులు మహిళలు ఉన్నారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమేద్దాం

నాగర్‌కర్నూల్‌రూరల్: ఎయిడ్స్ మహమ్మారిని తరిమేద్దామని వర్క్‌షాప్ ప్రోగ్రాం అధికారి డా రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై కోక్రియేషన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా వర్క్‌షాప్ ప్రోగ్రాం అధికారి డా రవికుమార్ పాల్గొని మాట్లాడారు. హెచ్ఐవీ పరీక్షల కోసం ఐసీటీసీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు, ఏఆర్‌టీ చికిత్స కోసం వచ్చే లబ్ధిదారులకు మౌలిక వసతులు తాగునీరు, వెయిటింగ్ రూమ్, కుర్చీలు లాంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సత్యబృందం ఎన్‌జీఓ ప్రతినిధి అవినాశ్, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ రమేష్, ఐసీటీసీ కౌన్సిలర్‌లు, ట్రాన్స్‌జెండర్స్, ప్రతినిధులు ఇతర ఎన్‌జీఓ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వెల్దండ: మండలంలోని రాఘయపల్లిలో బీఆర్ఎస్ నాయకులు మెండే కొండల్‌యాదవ్ తల్లి మాజీ వార్డు సభ్యురాలు మెండే లక్ష్మమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి ఓదార్చారు. అదేవిధంగా సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు సమకూర్చిన రూ.10వేలను మాజీ సర్పంచ్ సాయికుమార్ బాధిత కుటుంబానికి అందజేశారు.

సామూహిక వ్రతాలు

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని కేసరి సముద్రం పక్కన గల పురాతనమైన శివాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం హనుమత్ జయంతి సందర్భంగా గణేష్ బృందం ఆధ్వర్యంలో సామూహిక హనుమత్ వ్రతాలు నిర్వహించారు. ఎలిమే ఈశ్వరయ్య, మిడిదొడ్డి శివశంకర్, కానపురం బుచ్చన్న పాల్గొన్నారు.

పాన్‌షాప్‌లో చోరీ

తెలకపల్లి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న పాన్‌షాప్‌లో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. తాళం పగలగొట్టి దుకాణంలో ఉన్న సిగరెట్ డబ్బాలు, లైటర్లు, ఇతర సామాగ్రి, నగదును చోరీ అయినట్లు ఎస్ఐ తెలిపారు. దుకాణ యజమాని వంగ రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కలుపు నివారణ పరికరాలు అందజేత

మన్ననూర్: అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి రైతువేదికలో రైతులకు కలుపు తీసే పరికరాలను ఐసీఐసీఐ ఫౌండేషన్ ద్వారా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఐసీఐసీఐ ఫౌండేషన్ రూరల్ లైలీవుడ్ పాట్నర్ గంధం అంతయ్య మాట్లాడుతూ కొంత కాలంగా రైతులకు ఎన్నో రకాల ప్రోత్సాహకాలను ఫౌండేషన్ ద్వారా అందించామన్నారు. వలంటీర్ ప్రభాకర్ రైతులు పాల్గొన్నారు.

అక్రమ డిప్యూటేషన్‌ను రద్దు చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్‌ను ప్రభుత్వం రద్దు చేయాలని ఎంఎస్ఎఫ్, బీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి బి దాసు, బీసీ విద్యార్థి సంఘం నాయకులు భరత్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే మూతపడిన పాఠశాలలను తిరిగి పునర్ ప్రారంభించి కొనసాగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలను పొందినవారిని తొలగించాలని కోరారు.

దళితుల అభ్యున్నతిపై ప్రభుత్వం నిర్లక్ష్యం

తాడూరు: దళితుల అభ్యున్నతిపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో దళిత హక్కుల ఉద్యమ జాతీయ మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు నేటికి దళితుల దరి చేరడం లేదన్నారు. దళితులు అణిచివేతకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రాము, బాలు, నాగరాజు, బంగారయ్య, బాలమని, గోపాల్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక

తిమ్మాజిపేట: జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో మండలంలోని రాళ్లచెరువుతండా విద్యార్థిని ఎస్ నందిని ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. మల్టీపర్పస్ డిస్పెన్సర్ ఫర్ స్కూల్ చిల్డ్రన్ అనే ప్రాజెక్టు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపిక అయినట్లు హెచ్ఎం సుధీర్ తెలిపారు.

డిగ్రీ విద్యార్థులు..

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ అంతర్ విశ్వవిద్యాలయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల పాలమూరు యూనివర్సిటీలో నిర్వహించిన అంతర్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కళాశాలకు చెందిన బీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థిని గడ్డం రాజేశ్వరి, బీఏ ఫస్ట్ ఇయర్ విద్యార్థి అరవింద్‌లు ప్రతిభను చాటుకున్నారు. 5 కిలోమీటర్లు, 3 కిలోమీటర్ల పరుగు పోటీలో రాజేశ్వరి, 5 కి.మీ పరుగు పోటీల్లో అరవింద్‌లు మొదటి స్థానంలో నిలిచారు. వీరిద్దరిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ తెలిపారు. పీడీ రమేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

తిమ్మాజిపేట: మండలంలోని ఆవంచ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ బుసనమోని నర్సింహా(35) ఈనెల 1వ తేదీ నుంచి అదృశ్యమైనట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఆవంచకు చెందిన నర్సింహ 1న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వాళ్ల ఇళ్లలో వెతికిన ఆచూకి లభ్యం కాలేదు. దీంతో అతని భార్య లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పంప్‌మోడ్ పద్ధతిలో 7,594 క్యూసెక్కులు తరలింపు

దోమలపెంట: భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో ఇరవై నాలుగు గంటల వ్యవధిలో శ్రీశైలం ఆనకట్ట దిగువన సాగర్ జలాశయం నుంచి ఆనకట్ట ఎగువన శ్రీశైలం జలాశయంలోకి 7,594 క్యూసెక్కుల నీటిని (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,519, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజికెఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భకేంద్రంలో 3.527మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. శుక్రవారం శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం 863.8అడుగుల వద్ద 118.3380 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 35,315 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

వ్యాస మహర్షి వేషధారణలో ఉపాధ్యాయుడు

– వినూత్న రీతిలో విద్యా బోధన



వ్యాస మహర్షి వేషధారణలో మంద రమేష్

లింగాల: వ్యాస మహర్షి వేషధారణలో విద్యార్థులకు పాఠాన్ని బోధించాడు ఓ తెలుగు ఉపాధ్యాయుడు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు తెలుగు మాస్టర్ మంద రమేష్ వినూత్న రీతిలో బోధన చేసి ఆకట్టుకున్నారు. తెలుగు వాచకంలో ఉన్న భిక్ష పాఠాన్ని వ్యాసుడి పాత్రలో నాటకం ద్వారా డిజిటల్ తెరపై విద్యార్థులకు అర్థమయ్యే తరహాలో బోధించారు. ఉపాధ్యాయుడు చేతిలో కమండలం, రుద్రాక్ష మాల, తెల్లటి గడ్డం, పంచె కట్టుతో తరగతి గదిలో ప్రత్యక్షం కావడంతో విద్యార్థులు ఆసక్తిగా పాఠాన్ని విన్నారు. మంద రమేష్‌ను పలువురు అభినందించారు.